క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరుడికి అభిషేకాలు



వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం స్వామికి విశేషంగా పూజలు జరిగాయి. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలు నిర్వహించారు.

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం శేషవస్త్రాలను అందించారు.

ఘనంగా పోలమాంబ పండగ



పోలమాంబను దర్శించుకుంటున్న గ్రామ పెద్దలు

పరవాడ: మండలంలోని ఇ.బోనంగి గ్రామంలో కొలువుదీరిన పోలమాంబ అమ్మవారి పండగను భక్తులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సోదరుడు పంచకర్ల ప్రసాద్ అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామ సర్పంచ్ బొడ్డపు శ్రీనివాసరావు, కూటమి నాయకులు వియ్యపు చిన్న, బుగిడి రామగోవిందరావు, మేడిశెట్టి అప్పారావు, మేడిశెట్టి బాలాజీనాయుడు, వత్రి పరదేశి నాయుడు, వెన్నల నరసింగరావు, పంచకర్ల మణికంఠ, బొండా శ్రీనివాసరావు తదితరులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు.

చోడేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం నేడు



పెందుర్తి: పినగాడిలో కొలువుదీరిన చోడేశ్వరస్వామి దేవాలయ 17వ వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. వేకువజాము నుంచి మహా శివునికి విశేష అభిషేకాలు, అర్చనలు చేస్తామన్నారు. ఉదయం శివపార్వతుల కల్యాణం వైభవంగా జరపనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధనకు ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. సాయంత్రం ఊరేగింపు ఉంటుందన్నారు. భక్తులంతా వేడుకలో పాల్గొని స్వామివారి ప్రసాదం స్వీకరించాలని కోరారు. వార్షికోత్సవం సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు.

శివాలయ నిర్మాణానికి రూ.50,116 విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందిస్తున్న దాత వెంకునాయుడు, తదితరులు

సబ్బవరం: మండల కేంద్రం సబ్బవరంలోని శివాలయ పునర్నిర్మాణానికి సబ్బవరం శివారు చిన గొల్లలపాలెం గ్రామానికి చెందిన గొంప వెంకునాయుడు రూ.50,116 విరాళం ఇచ్చారు. నిర్మాణంలో ఉన్న స్వామివారి ఆలయం వద్ద ఈ మొత్తాన్ని ఆలయ కమిటీ సభ్యులకు మంగళవారం అందించారు. దాతకు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు దంగేటి నాగేశ్వరరావు, దంగేటి ప్రసాద్, కోరాడ శ్రీను, చింతల శ్రీను, బర్ల రమణ, సబ్బవరపు నాగభూషణం, అడ్వకేట్ పైడంనాయుడు తదితరులు ఉన్నారు.

వామ్మో.. స్పీడ్ బ్రేకర్లు





20 మీటర్ల దూరంలోనే నిర్మించిన రెండు స్పీడ్ బ్రేకర్లు, వాహనదారుల పాట్లు

- ప్రమాదాలకు నెలవుగా స్పీడ్ బ్రేకర్లు
- తరచూ వాహనాలకు మరమ్మతులు
- ఎత్తు తగ్గించాలని స్థానికుల వినతి

ప్రధాన రహదారుల్లో కూడళ్లు, విద్యా సంస్థలకు సమీపంలో స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు తప్పనిసరి. ఇవి వాహనాల వేగానికి కళ్లెం వేస్తాయి. అయితే పరవాడలోని పలు ప్రాంతాల్లో ఇష్టానుసారంగా నిర్మించిన స్పీడ్ బ్రేకర్లతో వాహనదారులు నరకయాతన పడుతున్నారు. ఎత్తు ఎక్కువ కావడంతో వాహనాల అడుగు భాగానికి తగిలి, తరచూ మరమ్మతులకు గురవుతున్నట్లు వాపోతున్నారు. కొన్ని స్పీడ్ బ్రేకర్లకు రంగులు వేయకపోవడంతో దగ్గరకు వచ్చేవరకూ గుర్తించలేక ఇబ్బందులు పడుతున్నారు.

పరవాడ:

ప్రమాదాలను అరికట్టడానికి వీలుగా యలమంచిలి–గాజువాక రహదారిలో పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లు ప్రయాణికుల పాలిట శాపాలుగా మారుతున్నాయి. ఈ రహదారిలో పరవాడ పోలీస్ స్టేషన్, జెడ్పీ పాఠశాల, గొర్లివానిపాలెం తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లు నిబంధనలకు విరుద్ధంగా ఎత్తుగా నిర్మించడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. విశాఖ, గాజువాక పట్టణాలకు రాకపోకలు సాగించే ప్రయాణికులతో పాటు స్టీల్‌ప్లాంట్, ఫార్మాసిటీ, ఎన్టీపీసీ పరిశ్రమల్లో పని చేసే ఉద్యోగులు, కార్మికులతో ఈ రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది.

వాహనాలకు మరమ్మతులు

స్టీల్ ప్లాంట్, దేశపాత్రుని పాలెం, పి.బోనంగి, పరవాడ ప్రాంతాల్లోని పాఠశాలలు, కళాశాలలకు రాకపోకలు సాగించే స్కూల్ బస్సులు ఎక్కువ. వీటికి తోడు వందల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు, కార్ల రాకపోకలు షరా మామూలే. ఇక్కడి ప్రధాన రహదారిలో పలు చోట్ల నిర్మించిన స్పీడ్ బ్రేకర్లు కాస్త ఎత్తుగా ఉన్నాయి. దీంతో చాలా వాహనాల అడుగు భాగం స్పీడ్ బ్రేకర్‌కు తగులుతోంది. కార్లు, ఆటోలు వంటి మినీ వాహనాలు కాస్త ముందుగా గుర్తించకుండా వస్తే చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

తరచూ వాహనాలు మరమ్మతులకు గురవుతున్నట్లు వాహన యజమానులు వాపోతున్నారు. పలుమార్లు ఈ స్పీడ్ బ్రేకర్ల కారణంగా వాహనాలు బ్రేక్ డౌన్ అయి.. రోడ్లపైనే ఆగిపోతున్నాయి.



మండల కాంప్లెక్సు వద్ద రంగులు లేని స్పీడ్ బ్రేకర్

రంగులేయని స్పీడ్ బ్రేకర్లు

కొత్తగా నిర్మించిన స్పీడ్ బ్రేకర్ల గురించి తెలియక రాత్రి సమయంలో రాకపోకలు సాగించే వాహనాలు అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. మరోవైపు మండల కాంప్లెక్స్, ఎలిమెంటరీ పాఠశాల, బొంకులదిబ్బ ప్రాంతాల్లో నిర్మించిన స్పీడ్ బ్రేకర్లకు రంగులు వేయలేదు. అక్కడ స్పీడ్ బ్రేకర్లు ఉన్నాయన్న విషయం కూడా వాహనదారులు గుర్తించలేని పరిస్థితి. దీంతో అకస్మాత్తుగా స్పీడ్ బ్రేకర్లను గుర్తించిన వారు సడెన్ బ్రేకులేసి ప్రమాదాలకు గురవుతున్నారు. తానాం గ్రామంలో వీధి రోడ్లలో కూడా ఇష్టానుసారంగా ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లతో నానా అవస్థలు పడుతున్నట్లు ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.

నిబంధనలేం చెప్తున్నాయ్

జాతీయ, రాష్ట్ర, జిల్లా, పట్టణ, కాలనీ రహదారుల్లో అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇండియన్ రోడ్ కాంగ్రెస్(ఐఆర్‌సీ) నిబంధనల మేరకు జిల్లా, పట్టణ స్థాయి రోడ్లపై స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుకు కొలతలు ఉన్నాయి. 10 సెం.మీ. ఎత్తు, 3.7 మీటర్ల వెడల్పు మాత్రమే ఉండాలి. స్పీడ్ బ్రేకర్ నిర్మించిన ప్రాంతానికి 40 మీ. దూరంలో హెచ్చరిక బోర్డు తప్పనిసరి. కాలనీలు, గ్రామీణ రహదారుల్లో తప్పనిసరైతే రబ్బర్ బ్రేకర్లు మాత్రమే బిగించాలి.

ఎత్తు తగ్గించాలి



ప్రధాన రహదారిలో నిబంధనలకు లోబడి స్పీడ్ బ్రేకర్ల ఎత్తును తగ్గించాలి. ఎత్తుగా నిర్మించిన స్పీడ్ బ్రేకర్ల వల్ల వాహనాలపై రాకపోకలు సాగించే క్రమంలో ప్రయాణికులు అదుపు తప్పి పడిపోతున్నారు. వీటిపైకి వెళ్లగానే వాహనాలు ఎగిరిపడుతున్నాయి. స్పీడ్ బ్రేకర్ల ఎత్తు తగ్గించేందుకు ఆర్‌అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఇ.మౌలిధర్, పరవాడ

ప్రమాదాల బారిన పడుతున్నాం



మెయిన్ రోడ్డులో కొత్తగా వేసిన స్పీడ్ బ్రేకర్ల వల్ల వాహనాలు అదుపుతప్పి, ప్రమాదాల బారిన పడుతున్నారు. పల్లెల్లో ఏర్పాటు చేస్తున్న స్పీడ్ బ్రేకర్లకు ఎలాంటి రంగులు వేయకుండా వదిలేస్తున్నారు. వాటి వలన ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. స్పీడ్ బ్రేకర్ల ఎత్తు తగ్గించడంతో పాటు, విధిగా వాటికి రంగులు వేయాలి.

– సూరాడ ముత్యాలు, ముత్యాలమ్మపాలెం

వాహనాలు పాడవుతున్నాయి



పరవాడ–గాజువాక రహదారిలో కొత్తగా ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లను బాగా ఎత్తు పెంచడం వల్ల వాహనాలు తరచూ రిపేర్లకు గురవుతున్నాయి. కార్లు, ఆటోలకు స్పీడ్ బ్రేకర్లు తగలడంతో వాహనాల అడుగు భాగాలు దెబ్బ తింటున్నాయి. అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్ల ఎత్తును కుదించేలా చర్యలు తీసుకోవాలి.

– షేక్ సైదులు, నునపర్తి

సందడిగా మెహందీ పోటీలు



పోటీలో పాల్గొన్న మహిళలు

పెందుర్తి: మహిళా దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా స్థానిక మణి బ్యూటీ ట్రైనింగ్ అకాడమీలో మంగళవారం మెహందీ పోటీలు సందడిగా జరిగాయి. పలువురు మహిళలు ఉత్సాహభరితంగా పోటీల్లో పాల్గొని, తమ ప్రతిభ కనబరిచారు. విజేతలకు ఈ నెల 8న జరిగే మహిళా దినోత్సవంలో బహుమతులు అందించనున్నట్లు అకాడమీ ఇన్‌చార్జి నాగమణి తెలిపారు.

పిఠాపురానికి ఎన్టీపీసీ సీఎస్సార్ నిధులు

- రూ.2.85 కోట్లతో అభివృద్ధి పనులకు ఒప్పందం



ఒప్పంద పత్రాన్ని ప్రదర్శిస్తున్న సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సమీర్‌శర్మ

పరవాడ: కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో కమ్యూనిటీడెవలప్‌మెంట్ ప్రాజెక్టుల అభివృద్ధి కోసం సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం రూ.2.85 కోట్లు ఖర్చు చేసేందుకు సుముఖత వ్యక్తం చేసింది. ఈ మేరకు కాకినాడ జిల్లా కలెక్టర్‌తో సంస్థ ఒప్పందం చేసుకుంది. మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సమీర్‌శర్మ, కాకినాడ చీఫ్ ప్లానింగ్ అధికారి మోహన్‌రావు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థన మేరకు ఈ ఒప్పందం జరిగింది. సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం మంజూరు చేయనున్న నిధులతో గొల్లప్రోలు మండలంలో సీసీ రోడ్లు, పాఠశాలలు, జూనియర్ కళాశాలలో సైన్స్ ల్యాబ్‌లు, సీహెచ్‌సీలో ఆక్సిజన్ ప్లాంట్, యు.కొత్తపల్లిలో కమ్యూనిటీ హాలు, పీహెచ్‌సీలో ఔట్ పేషెంట్ బ్లాక్ నిర్మాణాలతో పాటు పాఠశాలల్లో ఫర్నిచర్ సమకూర్చనున్నారు.

విస్తంలో ఉత్సాహంగా క్రీడా పోటీలు



ఖోఖోలో తలపడుతున్న క్రీడాకారులు

పెందుర్తి: పినగాడిలోని వెల్ఫేర్ ఇంజినీరింగ్(విస్తం) కళాశాలలో స్పోర్ట్స్ వీక్–2025లో భాగంగా రెండో రోజు మంగళవారం వివిధ క్రీడలు హోరాహోరీగా జరిగాయి. ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, కబడ్డీ, క్రికెట్ పోటీల్లో విద్యార్థులు తలపడ్డారు. కళాశాల ప్రెసిడెంట్ మళ్ల అనూష, వైస్ ప్రెసిడెంట్ బొల్లినేని సందీప్‌ల ఆధ్వర్యంలో జరిగిన క్రీడల్లో వివిధ బ్రాంచ్‌లకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇలాంటి క్రీడలతో విద్యార్థుల్లో శారీరక ఆరోగ్యంతోపాటు, మానసిక ఉల్లాసం పెరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. బుధవారం మరిన్ని క్రీడాపోటీల్లో విద్యార్థులు పాల్గొంటారని పేర్కొన్నారు.

పేకాట శిబిరంపై దాడి.. ఐదుగురిపై కేసు



పేకాట శిబిరంపై పోలీస్ దాడిలో పట్టుబడ్డ పేకాటరాయుళ్లు

పరవాడ: వెన్నలపాలెం గ్రామ సమీపంలో రహస్య ప్రదేశంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ఎస్ఐ మహాలక్ష్మి తన సిబ్బందితో మంగళవారం రాత్రి దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.35 వేల నగదు, 5 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై ఏపీ గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు సీఐ మల్లికార్జునరావు తెలిపారు. ఎవరైనా చట్టవ్యతిరేక చర్యలు, జూదానికి పాల్పడితే తమకు సమాచారం అందించాలని కోరారు ఈ దాడిలో ఎస్‌తోపాటు సిబ్బంది కనకరెడ్డి, వల్లీ, మురళీ, మోహన్‌ప్రసాద్, రాము నాయుడు పాల్గొన్నారు.

ఉద్యోగులకు నైపుణ్య శిక్షణ తరగతులు

ఏయూ వీసీ రాజశేఖర్



మాట్లాడుతున్న వీసీ రాజశేఖర్

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం బోధనేతర సిబ్బందికి విభిన్న విభాగాలు, అంశాలపై విస్తృత అవగాహన కల్పించేలా ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తానని వీసీ ఆచార్య రాజశేఖర్ అన్నారు. మంగళవారం అకడమిక్ సెనేట్ మందిరంలో వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్, డిప్యూటీ రిజిస్ట్రార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్‌లు, సూపరింటెండెంట్లు, ఇతర విభాగ అధిపతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్సిటీ ప్రతిష్టను పరిరక్షిస్తూ, మరింత పెంపొందించే దిశగా ప్రతి ఉద్యోగి పని చేయాలని సూచించారు. త్వరలో శతాబ్ది ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో మరింత వేగంతో పనిచేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. త్వరలో విభాగాల వారీగా ఉద్యోగులతో ప్రత్యేక సమావేశం, సమీక్ష నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఈఎన్ ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

ఏయూ వీసీకి అభినందనలు

ఏయూ వీసీగా బాధ్యతలు చేపట్టిన ఆచార్య జీపీ రాజశేఖర్‌ను వర్సిటీ పూర్వ వైస్ చాన్సలర్లు ఆచార్య బీలా సత్యనారాయణ, ఆచార్య జీఎస్ఎన్ రాజు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతిష్టాత్మక ఏయూకు వీసీగా నియమితులవడం అభినందనీయమన్నారు.

వందేళ్ల ఉత్సవాల్లో భాగస్వాముల్ని చేయండి

ఆంధ్ర యూనివర్సిటీ వందేళ్ల ఉత్సవాల్లో తమను భాగస్వాముల్ని చేయాలని వర్సిటీలో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులు వీసీ రాజశేఖర్‌ను కోరారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.సురేష్ మీనన్, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ శిరీష్, విక్రమ్, సురేంద్ర, దాస్, త్రినాథ్, పట్నాయక్, దంతేశ్వరి, సులోచన, జ్యోతి రమ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆంధ్ర యూనివర్సిటీలో నెలకొన్న విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం వైస్ చాన్సలర్ ఆచార్య రాజశేఖర్‌ను కలిసి క్యాంపస్ కాలేజీలు, వసతిగృహాల్లో నెలకొన్న సమస్యలను వివరించారు. వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు స్కాలర్‌షిప్ రాకపోవడంతో నెలకు విద్యార్థుల నుంచి రూ.3,500లకు పైగా ఫీజును వసూలు చేస్తున్నారన్నారు. ఫీజు చెల్లించని సందర్భంలో విద్యార్థుల హాస్టల్ మెస్ కార్డులను నిలిపివేస్తున్నారని వీసీ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం వీసీకి వినతిపత్రం అందజేశారు.

యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ప్రమాదాలు



శిబిరంలో మాట్లాడుతున్న సిటు నాయకుడు

కూర్మన్నపాలెం: ఉక్కు యాజమాన్యం అనాలోచిత నిర్ణయాల వల్ల కర్మాగారంలో ప్రమాదాలు సంభవిస్తున్నాయని సిటు నాయకులు ఆరోపించారు. కూర్మన్నపాలెం జంక్షన్‌లో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నిర్వహిస్తున్న దీక్షా శిబిరంలో మంగళవారం పలువురు నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిబిరాన్ని ఉద్దేశించి నాయకులు మాట్లాడుతూ నిర్మాణత్మకమైన నిర్ణయాలు తీసుకోకపోవడం వల్లే కర్మాగారంలోని యంత్రాల సామర్థ్యం పూర్తిగా తగ్గిపోయిందన్నారు. దీని వల్ల తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సిటు నాయకులు డీసీహెచ్ వెంకటేశ్వరరావు, భానుమూర్తి, విజయ్‌కుమార్, రమణ, ఎన్.రామారావు తదితరులు పాల్గొన్నారు.

తవ్వి వదిలేశారు



అగనంపూడి ప్రధాన బస్టాప్ వద్ద లోతుగా తవ్వి వదిలేసిన రహదారి

అగనంపూడి: జాతీయ రహదారి గోతులమయంగా మారడంతో బీటీ రోడ్డు వేస్తున్నారు. మూడు మాసాల నుంచి ఈ పనులు సాగుతున్నాయి. ప్రస్తుతం ఒక వైపు అనకాపల్లి వంతెన దగ్గర నుంచి అగనంపూడి టోల్‌గేటు వరకు పూర్తి కాగా, మరోవైపు సగం పని పూర్తి చేశారు. వంతెనలు, బస్టాప్‌లు, బస్‌బేలు, వీధి రోడ్ల అనుసంధాన మార్గాల వద్ద ఎక్కడా పనులు చేపట్టలేదు. అగనంపూడి కూడలి వద్ద బస్టాప్ జాతీయ రహదారిపై ఉంది. ఇక్కడ ట్రాఫిక్ జామ్ అవుతుండడంతో ట్రాఫిక్ పోలీసులు, హైవే అథారిటీ అధికారులు కొద్దిగా లోపలికి బస్టాప్ ఏర్పాటు చేసి బస్సులు హైవేపై నిలపకుండా చర్యలు చేపట్టారు. లోపలకు ప్రవేశించి బయటకు వచ్చే మధ్యలో గోతులు తవ్వి వదిలేశారు. 20 రోజులుగా దీన్ని పూడ్చలేదు. దీంతో రోడ్డు మీదే వాహనాలు నిలిచిపోతున్నాయని ప్రయాణికులు, స్థానికులు వాపోతున్నారు.

పాడిపశువులకు గాలికుంటు టీకాలు



గొటివాడలో టీకాలు వేస్తున్న డాక్టర్ స్వర్ణలత

సబ్బవరం: మండలంలోని పాడి రైతులంతా పాడి పశువులకు వేసే గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు ఉషాకుమారి మంగళవారం తెలిపారు. జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమాన్ని ఈ నెల 1 నుంచి 30 వరకూ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ శిబిరాలను నిర్వహించి, పాడి పశువులకు టీకాలను వేయనున్నట్లు వెల్లడించారు. గుల్లేపల్లి, బోదువలస, గొటివాడ, మల్లునాయుడుపాలెం, అమృతపురం, ఆరిపాక గ్రామాల్లో మంగళవారం వైద్య శిబిరాలను నిర్వహించినట్లు తెలిపారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్



సైన్స్ నమూనాలతో విద్యార్థులు

పరవాడ: స్థానిక సుమేధ విద్యా నికేతన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. ఈ ఎగ్జిబిషన్‌ను పరవాడ ఎంఈవో సాయిశైలజ ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన భౌతిక, రసాయన, ఖగోళ, పర్యావరణ శాస్త్రాలకు సంబంధించిన నమూనాలను పరవాడ ఎంఈవోలు సాయిశైలజ, దివాకర్‌రావులు తిలకించి విద్యార్థులను అభినందించారు. ఎగ్జిబిషన్‌లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన శిలాజాలు, వివిధ రంగాలకు సంబంధించిన పరిణామక్రమ ఎదుగుదల, నాణేలు, కరెన్సీ సేకరణ వంటి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విద్యా నికేతన్ ప్రిన్సిపాల్ కదలి విజయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిహారం ఇస్తేనే.. భూములు ఇస్తాం



ఆందోళన చేస్తున్న నాలుగు గ్రామాల రైతులు

- రైల్ ఓవర్ బ్రిడ్జి నిర్వాసితుల ఆందోళన

పెందుర్తి: పెందుర్తి–నార్త్ సింహాచలం రైల్వే లైన్‌లో పార్లుపాలెం, చింతలగ్రహారం ప్రాంతంలో తలపెట్టిన రైల్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. తమకు పరిహారం ఇవ్వకుండా వంతెన నిర్మాణం కోసం, దశాబ్దాలుగా జీవనోపాధి పొందుతున్న తమ భూములను అధికారులు లాక్కునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు అవసరం కాబట్టి రైల్వే ఫ్లై ఓవర్ వంతెన నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదన్నారు. అయితే వంతెన కోసం భూ సేకరణకు సిద్ధమైన అధికారులు, పరిహారం విషయంలో ఎలాంటి స్పష్టత ఇవ్వడం లేదన్నారు. భూములు ఇవ్వడానికి తాము సిద్ధమే అని.. అయితే పరిహారంపై ఉన్నతాధికారులు తమకు లిఖిత పూర్వక భరోసా ఇవ్వాలని స్పష్టం చేశారు. తమ భూములు సింహాచలం దేవస్థానం పరిధిలో కూడా ఉండడం వలన దేవస్థానం అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, తమకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. అనంతరం తహసీల్దార్ ఆనంద్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ ఆందోళనలో పార్లుపాలెం, చింతలగ్రహారం, చీమలాపల్లి, లక్ష్మీపురం ప్రాంతాల రైతులు పాల్గొన్నారు.

అమ్మవారి పండగల పోస్టర్ల ఆవిష్కరణ



పైడిమాంబ జాతర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గ్రామ పెద్దలు



పరదేశిమాంబ పండగ గోడపత్రికను ఆవిష్కరిస్తున్న గ్రామ పెద్దలు

పరవాడ: మండలంలోని పరవాడ, తానాం గ్రామాల్లో ఈ నెల 11న నిర్వహించనున్న పైడిమాంబ, పరదేశిమాంబ పండగల వాల్‌పోస్టర్లను ఆయా గ్రామాల్లో గ్రామ పెద్దలు మంగళవారం ఆవిష్కరించారు. మండల కేంద్రం పరవాడ గ్రామంలో కొలువుదీరిన పైడిమాంబ అమ్మవారి పండగను ఈ నెల 9, 10, 11 తేదీల్లో నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ విస్తృత ఏర్పాట్లు చేసింది. అందుకు సంబంధించిన గోడ పత్రికను అమ్మవారి ఆలయ ప్రాంగణంలో గ్రామ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడు, కూటమి నాయకులు పైల సన్యాసిరావు, రెడ్డి శ్రీనివాసరావు, పైల రామచంద్ర రావు ఆవిష్కరించారు.

తానాం గ్రామంలో 9 నుంచి మూడు రోజులపాటు జరపనున్న పరదేశిమాంబ అమ్మవారి పండగ వాల్ పోస్టర్‌ను గ్రామ సర్పంచ్ కన్నూరి దేవివెంకటరమణ, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పైల జగన్నాథ రావు, మాజీ సర్పంచ్ పైల రామారావు, గ్రామ పెద్దలు గొరుపూటి కన్నంనాయుడు, సన్యాసిరావు, పి.జానకీరావు, వత్రి వెంకటరమణ, వత్రి పరదేశినాయుడు, బెల్లాల విశ్వేశ్వరరావు, జి.ముత్యాల నాయుడు, పైల ఈశ్వరరావు తదితరులు ఆవిష్కరించారు.